బీఏఎస్ఎల్పీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్పీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్పీ మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 22లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 25వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి వన్‌టైమ్ చాన్స్ అవకాశం కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును వచ్చే నెల 16లోగా, రూ.500 అపరాధ రుసుముతో కలిపి 28లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ ఎంసీఏ మెయిన్, బ్యాక్‌లాగ్, దూరవిద్య ఎంసీఏ రెండో సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు.విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 17లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 19వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 17లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఫార్మ్‌డీ, ఆరేళ్ల ఫార్మ్‌డీ ఇన్‌స్టంట్ పరీక్షలను ఈ నెల 19 నుంచి, బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ రెండు, నాలు గు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పా రు.

ఎల్ఎల్ఎం జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్ఎం జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం పక్కదారి పట్టకుండా చూడాలి

బన్సీలాల్‌పేట్, జూలై 11 : బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయం పక్కదారి పడుతున్నదని, దానిపై విచారణ చేపట్టాలని బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐ.చిరంజీవి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ డివిజన్‌లో ఒకే ఆలయానికి మూడు చెక్కులు ఇవ్వడం లాంటి పలు ఆధారాలను జతపరిచామని, సమగ్రంగా విచారణ జరిపించాలని, అర్హులైన దేవాలయాల కమిటీలకే ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు.

మోండామార్కెట్, బండిమ్మెట్ ప్రాంతాల్లో గుంతలమయంగా ఉన్న రోడ్లు

దేవాలయం పరిసరాల్లోనే రోడ్లపై చెత్త

ఎక్కడి పనులు అక్కడే..

సమీపిస్తున్న లష్కర్ బోనాలు..

తూతూ మంత్రంగా రోడ్లు ప్యాచ్‌వర్క్ పనులు

రోడ్లపై దర్శనమిస్తున్న మురుగు, చెత్త

బేగంపేట్, జూలై 11: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఈ నెల 21, 22న జరుగనుంది. లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారు. ఈ క్రమంలో ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతర పనుల్లో భాగంగా రోడ్డు ప్యాచ్ వర్కులు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఎక్కడ కూడా రోడ్డు ప్యాచ్‌వర్కులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఒక వేళ వేసినా అవి నామ మాత్రంగా వేస్తున్నట్టు కనిపిస్తున్నాయి. జాతరకు ఇంకా తొమ్మిది రోజులు మాత్రమే ఉంది.

తూతూ మంత్రంగా ప్యాచ్ వర్క్ పనులు..

బేగంపేట్ సర్కిల్.. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఉన్న మహంకాళి వీధిలో ఉన్న ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు, అలాగే బేగంపేట్, మోండామార్కెట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఉన్న ఆయా అమ్మవారి ఆలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా అమ్మవారి జాతర జరిగే ప్రాంతాలైన రాణిగంజ్, మోండామార్కెట్, సికంద్ బజార్, నాలా బజార్, బండిమ్మెట్, శివాజీనగర్, జనరల్ బజార్ ప్రాంతాల్లో గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఎక్కడ చూసిన రోడ్లు గుంతలమయంగా దర్శనమివ్వడంతో అమ్మవార్ల ఊరేగింపునకు ఇబ్బందులు ఎదరవుతాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాణిగంజ్ ప్రాంతంలో తూతూ మంత్రంగా రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. ఆలయ పరిసరాలతో పాటు డివిజన్‌లో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు నీరు, చెత్త దర్శమిస్తున్నది. అధికారులు పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు త్వరగా చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నాం..

మా పరిధిలో ఉన్న రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాల్లో జలమండలి వారు చేయాల్సి ఉంది. అవి మా పరిధిలోకి రావు. మేమే చేయాల్సిన రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపడుతున్నాం.

– సుదర్శన్, బేగంపేట్ సర్కిల్, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

ఐదోవార్డులోని వాసవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడ్‌పల్లి, జూలై 11: కంటోన్మెంట్ ఐదో వార్డు వాసవీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ ఐదో వార్డు వాసవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, అసోసియేషన్ ప్రతినిధులు స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ మంచి నీరు సదుపాయం, దోమల బెడద ఎక్కువగా ఉందని పలు సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు బొజ్జ అజయ్, అసోసియేషన్ సభ్యులు తేలుకుంట అరుణ్ జ్యోతి సతీష్ గుప్త, భాస్కర్, కోట నాగేశ్వర్‌రావు, రేపాల వెంకటేశ్వర్లు, రవికాంత్, శ్రీనివాస్, అమర్‌నాథ్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి చేయాలి

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఉన్న పార్కులను అభివృద్ధి చేయాలని యూఎండీ అడిషనల్ కమిషనర్ సునంద రాణిని గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్ సామల హేమ కలిసి కోరారు. హార్టికల్చర్ సిబ్బంది పెంచాలని ,హార్టికల్చర్ సిబ్బంది వాడే పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు కార్పొరేటర్ హేమ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.– సికింద్రాబాద్

ఆర్యనగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్యనగర్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు వారు తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో గురువారం నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్యనగర్‌లోని రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పరిస్థితి కూడా ఘోరంగా ఉందని వాపోయారు. డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. వీటి ని తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలని డిప్యూటీ మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

జనాభా నియంత్రణపై అవగాహన ఉండాలి



ప్రపంచ జనాభా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ వుమెన్‌లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎకానమిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంవీ హాల్‌లో 'టు లీవ్ నో వన్ బిహైండ్, కౌంట్ ఎవ్రీవన్'అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ప్రపంచ జనాభా తీరుతెన్నులను వివరించారు. ప్రపంచంలో జనాభా పెరుగుతుండడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జనాభా నియంత్రణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజల్లో జనాభా నియంత్రణపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. ఝాన్సీరాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కరుణాదేవి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ. ప్రమీల, ఎకానమిక్స్ విభాగం హెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు, పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ డాక్టర్ వై. వసుంధర, డాక్టర్ సరిత, అలివేణి, డాక్టర్ వసంత, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దేవుళ్ల తో సమానం

వైద్యులను,చార్టర్డ్ అకౌంట్‌లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ బాలానగర్ సభ్యులు

బేగంపేట్, జూలై 11: లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఎలైట్ ఆధ్వర్యంలో వైద్యులు, చార్టర్డ్ అకౌంట్‌లను ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ డే సందర్భంగా గురువారం సికింద్రాబాద్ ప్యారడైజ్ లయన్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్య పాల్గొని వైద్యులను, చార్టర్డ్ అకౌంట్‌లను సత్కరించారు. సమాజంలో వీరి పాత్ర ఎంతో విలువైందన్నారు. ఈ సందర్భంగా జోన్ చైర్ పర్సన్ డాక్టర్ వి సుబ్రమణ్యం మాట్లాడుతూ..వైద్యులు దేవుళ్లతో సమానమని అంటారు, అలాంటి వైద్యులను సత్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు తుమ్మ శ్రీనివాస్, చైతన్య బాటియా గోపినాథ్, కిశోర్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అరుణ్‌కుమార్, తదితరులు

పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలి

అడ్డగుట్ట, జూలై 11 : రైల్వే ఉద్యోగులకు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ(ఎస్‌సీఆర్ఈఎఫ్) వర్క్‌షాపు డివిజన్ సెక్రటరీ, లాలాగూడ బ్రాంచ్ సెక్రటరీ ఎం.జి.అరుణ్‌కుమార్ అన్నారు. ఎన్ఎఫ్ఐఆర్, ఎస్‌సీఆర్ ఈఎస్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఆదేశాల మేరకు గురువారం లాలాగూడ రైల్వే క్యారేజ్ వర్క్‌షాపు మెయిన్ గేటు దగ్గర అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరు కూడా కొత్త పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. కొత్త పెన్షన్ స్కీం పద్ధతి వల్ల రైల్వే ఉద్యోగులు నష్టపోతారని ఆయన స్పష్టం చేశారు.

కొత్త పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయిస్ సంఘ నాయకులు బాబు నాయక్, చంద్రశేఖర్, రవికాంత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీజీ సీపీజీఈటీ 2024 పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ – 2024 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 16 వరకు జరుగనున్నట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు గురువారం ఆరు సబ్జెక్టులకు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 8,783 మంది దరఖాస్తు చేసుకోగా, మొత్తం 7,711 మంది హాజరయ్యారని వివరించారు. హాజరు శాతం 87.79గా నమోదైందని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేయాలి

బన్సీలాల్‌పేట్, జూలై 11 : ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్–18లో గ్రేస్ మార్కులు కలపాలని ప్రభుత్వం చెప్పినా కొన్ని కాలేజీలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్–18 పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులందరికీ గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా, కొన్ని అటానమస్ విద్యాసంస్థల యాజమాన్యాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఫిర్యాదు చేశారు. తాము ప్రభుత్వ ఆదేశాలను పాటించేది లేదని చెప్పి, విద్యార్థులను ఫెయిల్ చేసి, మళ్ళీ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయని వివరించారు. యూనివర్సిటీలకు ఇన్‌చార్జీలు కాకుండా ఫుల్‌టైమ్ వీసీలను వెంటనే నియమించాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి, వెంటనే యూనివర్సిటీ కన్వీనర్‌తో ఫోన్‌లో మాట్లాడారని, ఇలాంటి ఘటనలపై విచారణకు ఆదేశించారని మహేందర్ తెలిపారు. కార్యదర్శిని కలిసిన వారిలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు నామని మహేశ్, అధికార ప్రతినిధి ఆదిత్య, కార్యదర్శి అరవింద్, ప్రతాప్ వినీత్, మనోహర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ

బొల్లారం,జూలై 11:బోయిన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రగతి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ..విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, నర్సింగ్ ముదిరాజ్,బల్వంత్ రెడ్డి, క్రాంతి, సయ్యద్, సదా,మారుతి తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్నఎమ్మెల్యే శ్రీ గణేష్, ట్రస్ట్ నిర్వాహకులు

ఎస్సీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

బన్సీలాల్‌పేట్, జూలై 11 : పేద ఎస్సీ పిల్లలకు కార్పొరేట్ విద్య అందించడానికి 2014 నుంచి అమలు చేస్తున్న 'బెస్ట్ అవైలేబుల్ స్కూల్స్' పథకం వరప్రదాయినిగా నిలుస్తున్నదని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు అన్నారు. గురువారం 'బెస్ట్ అవైలేబుల్ స్కూల్స్' పథకం ద్వారా ఎంపికైన 18 మంది విద్యార్థులను భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చేర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 ఏండ్లుగా ఎస్సీ అభివృద్ధి శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం, తమ ఎస్సీఆర్పీఎస్ ద్వారా బస్తీలలోని నిరుపేద తల్లిదండ్రులకు ఈ పథకం ప్రయోజనాల గురించి అవగాహన కల్పించి, ఉచిత ప్రవేశాలను కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్ జిల్లాలో ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన లాటరీ పద్ధతిలో ఎంపికైన ప్రతి ఏడాది 150 మంది ఎస్సీ విద్యార్థులు తమ నివాసానికి సమీపంలోని ప్రైవేట్ స్కూళ్ళలో ప్రవేశాలను పొందుతున్నారని, ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు వారి స్కూల్ ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ఎస్సీఆర్పీఎస్ నగర అధ్యక్షుడు విజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు కే.మహేందర్, నాయకులు రాపాక అశోక్, గోవర్ధన్, కుమార్, లింగం, సెల్వరాజ్, బీఆర్ఎస్ నాయకులు ఏసూరి మహేశ్, రాంబాబు, జనార్దన్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలో చేరిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సీఆర్పీఎస్ సంఘం నాయకులు

కంటోన్మెంట్ రెండో వార్డు రసూల్‌పురా కట్టమైసమ్మ అంగన్‌వాడీ కేంద్రానికి గురువారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ సీలింగ్ ఫ్యాను,ట్యూబ్‌లైట్సు,ఫ్లోర్ మ్యాట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది,బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం

కంటోన్మెంట్ రెండో వార్డు రసూల్‌పురా బస్తీలో యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల హక్కులు,ఆరోగ్యం,సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. – బొల్లారం

అందరి సహకారంతో కల్యాణం విజయవంతం

అమీర్‌పేట్, జూలై 11 : అందరి భాగస్వామ్యంతో ప్రతిష్ఠాత్మక బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలు విజయవంతంగా ముగిశాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ అన్నారు. గురువారం అమీర్‌పేట్‌లోని పార్టీ నియోజకవర్గం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి వేడుకలను విజయవంతం చేశారన్నారు. కొన్ని చెదురు మొదురు ఘటనలు మినహా వేడుకలు ప్రశాంతంగా ముగిసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. వేడుకలను విజయవంతం చేయడంలో దేవాదాయ, జీహెచ్ఎంసీ, జలమండలి, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, విద్యుత్, పోలీస్ శాఖలు తమ వంతు బాధ్యతలు శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు.

కోటా నీలిమను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రసూల్‌పుర జంక్షన్ వద్ద కార్లకు బ్లాక్ ఫిలింలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

బేగంపేట్, జూలై 11: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు, జరిమానాలు తప్పవని బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు. గురువారం బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పుర జంక్షన్, మినిస్టర్ రోడ్డు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కార్లకు బ్లాక్ ఫిలింలను తొలగించారు. కార్లకు బ్లాక్ ఫిలింను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పాపయ్య మాట్లాడుతూ..వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిమానాలు గతంతో పోలిస్తే చాలా వరకు అధికమయ్యాయన్నారు. ఈ డ్రైవ్‌లో బేగంపేట్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మహిళా సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా శ్యామల రమణి

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా సేవాదళ్ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా శ్యామల రమణి నియమితులయ్యారు. గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామల రమణికి రాష్ట్ర మహిళా సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ భవానీ త్రివేది నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

– ఉస్మానియా యూనివర్సిటీ

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం



రాజేందర్ యాదవ్‌ను కలిసిన క్రాంతి రజక సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, జూలై 11 : చిలకలగూడ ధోబీఘాట్‌లోని అమ్మవారి ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ర్యాల అడవయ్య యాదవ్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ర్యాల రాజేందర్ యాదవ